క్లుప్తంగా

రేపు మండల సర్వసభ్య సమావేశం

చిట్యాల: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 28న (గురువారం) నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖాల మండల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరు కావాలని తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరు కానున్నట్లు తెలిపారు.

సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని వినతి



నర్సంపేట: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పని చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలను, యూపీహెచ్‌సీ ఎన్‌ఎంలను, ఇసి ఎన్‌ఎంలను బేషరతుగా రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ రాష్ట్ర పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు నర్సంపేట డివిజన్ సెకండ్ ఏఎన్‌ఎంలు సుజాత, చంద్రకళ, రజిత, కవిత మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏఎన్‌ఎంలు మాట్లాడారు. నోటిఫికేషన్ రద్దు చేసి రెగ్యులర్ చేయాలని, పీఆర్‌సీ బకాయిలు విడుదల చేయాలని, హెల్త్ ఇన్సూరెన్స్‌ను రూ.10 లక్షలకు పెంచాలని, మృతి చెందితే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించడంతోపాటు పరీక్ష రాయడానికి అవకాశం లేని 53 ఏళ్లపైబడ్డ వారికి రిటైర్‌మెంట్ సమయంలో రూ.5 లక్షల లైఫ్‌టైం గ్రాట్యూటీ అందించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు.

గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

నర్సంపేట: గీత కార్మికులకు బకాయి ఉన్న ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ)రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి రమేశ్ హాజరై మాట్లాడారు. ఐదు నెలలుగా ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందిన, గాయపడిన గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడం లేదన్నారు. సేఫ్టీ మోకులు అందిస్తామని గత ప్రభుత్వం వాగ్దానం చేసి అమలు చేయలేదని చెప్పారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కారం కోసం కల్లు, గీత కార్పొరేషన్‌కు చైర్మన్‌ను, పూర్తి స్థాయి కమిటీని నియమించడంతోపాటు రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు.

సాంఘిక బహిష్కరణ నిందితులపై చర్యలు తీసుకోవాలి

నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన గీత కార్మికుడు నరేశ్‌ను సాంఘిక బహిష్కరణకు గురి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రమేశ్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్లుకు సంబంధించిన డబ్బులు చెల్లించలేదని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు వేధించి బహిష్కరించారని చెప్పారు. నరేశ్‌కు కిరాణ దుకాణాల్లో సరుకులు ఇవ్వొద్దని, అతనితో గ్రామస్తులు మాట్లాడితే జరిమానా విధిస్తామని కట్టడి చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం సమగ్ర విచారణ చేయించాలని బాధితుడికి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు గంప రాజేశ్వర్, రడం శ్రీనివాస్, జూలూరి హరిప్రసాద్, దొంతి సంతోశ్, బొడిగే మల్లేషం, పంజాల వెంకట్, జునూరి నరేశ్, క్లాపు వెంకట్, గండి యాదగిరి, నాంపల్లి వెంకట్ ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు న్యాయం



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



పడి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే

భూపాలపల్లి రూరల్: పేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అర్హులైన 86 మందికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా హామీలన్ని అమలు చేస్తామన్నారు. రానున్న రోజుల్లో కొత్తగా పెళ్లయిన ప్రతి పేదింటి ఆడబిడ్డకు రూ.లక్ష 16 వేలతో పాటు తులం బంగారం అందించనున్నట్లు తెలిపారు. కల్యాణలక్ష్మి చెక్కుల కోసం ఎవరు దళారులను ఆశ్రయించవద్దని అర్హులైన ప్రతి ఒక్క ఆడపడుచులకి కాంగ్రెస్ ప్రభుత్వంలో తప్పక న్యాయం జరుగుతుందన్నారు. ఎవరైనా అధికారులు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ప్రభుత్వంలాగా ఎమ్మెల్యేల చుట్టూ తిరిగే విధంగా కాకుండా రానున్న రోజుల్లో అధికారులే అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఆర్డీఓ రమాదేవి, తహసీల్దార్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్ గౌడ్, చల్ల రేణుక, సంపత్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, పిప్పాల రాజేందర్, మహేందర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా అయ్యప్ప పడి పూజ

అయ్యప్పస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. పట్టణంలోని చతుర్రూప అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ ప్రెసిడెంట్ బండారి(సురబి) రమేష్ గురుస్వామి, జనరల్ సెక్రటరీ ఓరం వాసు గురుస్వామి ఆధ్వర్యంలో మండల మపడి పూజ నిర్వహించారు. ఆలయ అర్చకుడు కృష్ణమాచార్యులు ఆకుల మహేందర్–అరుణ దంపతులచే అభిషేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు–పద్మ దంపతులు హాజరై పడిని వెలిగించారు. గురుస్వాములు భాగవతం వీరస్వామి, లట్టి రాజబాబు, సురిమిళ్ళ శ్రీనివాస్, రత్నం శివారెడ్డి, కుమారస్వామి, ఆరెల్లి నరేందర్, బండబాబు, బోయిని వెంకటస్వామి, రాజు, చల్లూరు ప్రభాకర్ పాల్గొన్నారు.

ఘనంగా దత్త జయంతి వేడుకలు



కాళేశ్వరం: పూజలో పాల్గొన్న భక్తులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ దేవాలయమైన శ్రీదత్తాత్రేయస్వామి ఆలయంలో దత్త జయంతిని పురస్కరించుకొని మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి త్రిపురారి కృష్ణమూర్తిశర్మ, ప్రశాంత్ శర్మ, ఫణీంద్రశర్మల ఆధ్వర్యంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం భక్తులు ప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ మహేష్, సర్పంచ్ వసంత, ఎంపీటీసీ మమత, ధర్మకర్తలు రామ్‌రెడ్డి, సమ్మయ్య, శ్యాంసుందర్‌దేవుడా, పద్మ పాల్గొన్నారు.

గణపురం: మండలకేంద్రంలోని శ్రీ షిర్డి సాయి బాబా ఆలయంలో మంగళవారం దత్త జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దత్త జయంతి సందర్భంగా ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు సాయి నాథుడికి సంధ్య హారతి అనంతరం అభిషేకం, మధ్యాహ్నం 12.30 గంటలకు మధ్యాహ్న హారతి ఇచ్చారు. అయ్యప్ప మాలధారులకు భిక్షతో పాటు భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం కసిరెడ్డి సురేందర్ రెడ్డి దంపతులు ఆధ్వర్యంలో చేశారు. ఆలయ ధర్మకర్త, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారయణరావు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

‘విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం’



విరాళాలు సేకరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఏటూరునాగారం: దేశంలో విద్యారంగ పరిరక్షణకు పోరాడాలని ఎస్ఎఫ్ఐ ఏటూరునాగారం డివిజన్ కార్యదర్శి జాగటి రవితేజ అన్నారు. ఏటూరునాగారం మండల కేంద్రంలో ఛలో ఢిల్లీ జయప్రదం చేయాలని షాప్‌టుషాప్ విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. చిన్నవయసులోనే విద్యార్థుల పాఠ్యపుస్తకాలు మతోన్మాద భావజాలాలను జొప్పిస్తూ విద్యారంగాన్ని కాషాయకరణ చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల పాఠ్యపుస్తకాలలో జాతీయ ఉద్యమ నాయకుల చరిత్రను తొలగించి జాతీయ ఉద్యమంతో సంబంధంలేని గాడ్సే, వీడి సావర్కర్ చరిత్రలను పొందపరుస్తున్నారన్నారు. కేంద్ర విశ్వవిద్యాలయంలో మౌలిక సదుపాయాలు కల్పనకు కనీసం నిధులు కేటాయించడం లేదన్నారు. అలాగే రాష్ట్రంలో నూతన ప్రభుత్వం విద్యార్థుల ఆకాంక్షలు నెరవేర్చాలని రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న రూ.7800 కోట్ల పెండింగ్ స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కావేరి భైరేష్, మందపల్లి స్వామి, కోయిల బాలేశ్వర్ ఆతుకూరి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం



భూపాలపల్లి అర్బన్: పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న రాజ్‌కుమార్

భూపాలపల్లి అర్బన్: సీపీఐ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జెండావిష్కరణ చేపట్టారు. అనంతరం రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. 1925 సంవత్సరంలో ఏర్పడిన సీపీఐ పార్టీ నాటి నుంచి నిరుపేదల పక్షాన పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, సుగుణ, సాంబమూర్తి, లావణ్య, రవి, భద్రయ్య, వనిత, యాకొబ్‌లు పాల్గొన్నారు.



రేగొండలో..

రేగొండ: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) వార్షికోత్సవాన్ని రేగొండ, గోరికొత్తపల్లి మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి, సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ జిల్లా సినియర్ నాయకుడు మామిడాల సమ్మిరెడ్డి మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 99 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం గర్వకారణమన్నారు. బ్రిటీష్ సామ్రాజ్య కాలం నుంచి నేటి వరకు ప్రజల పక్షాన పోరాడుతున్న ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రమౌళి, రాజేందర్, శాంతికుమార్, పెంట రవి, ఆగయ్య, క్రాంతికుమార్, మోహన్, సారంగపాణి, రాజేందర్, రామయ్య, సారయ్య, రఘుపతి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మహాముత్తారం: వికసిత భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా మండలంలోని స్తంబంపల్లి(పీకే), రేగులగూడెం గ్రామాల్లో మంగళవారం డిజిటల్ వీడియో ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం క్యాలండర్ ఆవిష్కరించారు. మహాముత్తారం బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ రోహన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవల్సిన అవసరం ఉందన్నారు. అదే విధంగా ఉపాధికల్పన కోసం కేంద్ర ప్రభుత్వం అనేక రకాలైన రుణాలను అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ గణేష్, ఏఓ ఆస్మా, సీఎఫ్ఎల్ కౌన్సిలర్ రాజేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

ఎన్‌హెచ్ఆర్‌సీ మండల అధ్యక్షుల నియామకం

టేకుమట్ల: జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) మండల అధ్యక్షుడిగా మండలంలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన బీనవేని సాంబయ్యను మంగళవారం ఎన్నుకున్నట్లు జాతీయ మానవ హక్కుల కమిషన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుల భద్రయ్య తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే మార్గంగా ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా బలమైన లీగల్ ప్రొసీజర్, ప్రోటోకాల్‌తో ఎన్‌హెచ్ఆర్‌సీ పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, బండి సుదర్శన్, వంగ ప్రభాకర్, దూడపాక భద్రయ్య, ఆకినపల్లి మహేందర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల: నియామక పత్రం అందజేస్తున్న భద్రయ్య

చిట్యాల: నేషనల్ హ్యూమాన్ రైట్స్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) జాతీయ మానవ హక్కుల మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ఉయ్యాల రమేష్‌ను నియమించినట్లు ఎన్‌హెచ్ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య మంగళవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఈసీ సభ్యులు కొటగిరి సతీష్, నాయకులు పాల్గొన్నారు.



మల్లారంలో కమ్ముకున్న పొగమంచు

మంచు దుప్పటి

రోజురోజుకూ చలి తీవ్రత పెరుతుండటంతో చాలా ప్రాంతంలో ఉదయం 9 గంటల వరకు మంచు కమ్ముకుంది. మండలంలో తాడిచర్ల, మల్లారం, పెద్దతూండ్ల, కొయ్యూరు తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం నుంచి 8 గంటల వరకు రోడ్లతో పాటు పొలాల్లో మంచుదుప్పటి కమ్మేసింది. ప్రజలు 9 గంటలు వరకూ బయటకు రావడం లేదు. - మల్హర్

ధాన్యం కొనుగోలుపై రైతుల హర్షం



ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఏటూరునాగారం: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఏమాత్రం తరుగులేకుండా కొనుగోలు చేస్తుడంతో రైతుల హర్షం వ్యక్తం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జీసీసీ పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ.. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం నెలల తరబడి కల్లాలోని ఉండిపోవడం వర్షాలకు తడిసి మొలకలు వచ్చిన కొనుగోలు కాకపోవడం తీర కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని కింటాకు 10 కిలోలు చొప్పున తరుగు తీసేవారని తెలిపారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే మార్పులు వచ్చాయన్నారు. ఏలాంటి తరుగు లేకుండా వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్టే కొనుగోలు చేస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఖలీల్ ఖాన్, గుడ్ల దేవేందర్, ముక్కెర లాలయ్య, వావిలాల ఎల్లయ్య, వావిలాల నరసింగరావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాలరాజు, ఎండి గౌస్, తాళ్లపల్లి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

పరకాల: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం నిర్మాణంతో పాటు విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్ కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసిన ఆయన పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాలకు ఆర్టీసీ బస్సులను నడుపాలని కోరగా ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ



కాటారం: అక్షింతలతో ర్యాలీ తీస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

కాటారం: అయోధ్య రామమందిర ప్రతిష్ఠాపన నిర్మాణంలో భాగంగా రాముడి అక్షింతలను జిల్లా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో భక్తులకు పంపిణీ చేశారు. స్వామి వారి పవిత్ర అక్షింతలు ప్రతి భక్తుడి ఇంటికి చేరాలనే ఉద్దేశంతో వితరణ చేసినట్లు విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు దేవరాజు, మండల అధ్యక్షుడు జంగ సమ్మయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పెండ్యాల రాజయ్య, సముద్రాల రామాచార్యులు, ఊర వెంకటేశ్వరరావు, రవి, కొలుగూరి సది, సదయ్య, సతీశ్, పల్నాటి బలరాం, సతీశ్ పాల్గొన్నారు.

మండలానికి చేరుకున్న రాముడి అక్షింతలు



వెంకటాపురం(కె): ఊరేగింపు చేస్తున్న శ్రీరాముడి అక్షింతలు

వెంకటాపురం(కె): మండల కేంద్రానికి అయోధ్య శ్రీరాముని అక్షింతలు ప్రత్యేక వాహనంలో చేరుకున్నాయి. మండలంకు చేరుకున్న అక్షింతలకు కనకదుర్గమ్మ గుడి సెంటర్‌లో రామ భక్తులు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. గామస్తులు, రామ భక్తులు అక్షింతలను ఊరేగింపు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

ములుగు: జిల్లా కేంద్రంలోని నేషనల్ హైవే 163పై తరచూ జరుగుతున్న ప్రమాదాలను నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర ఈసీ మెంబర్ చల్లూరి మహేందర్ ఎస్పీ గాష్ ఆలంను కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఎస్పీకి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. జాతీయ మానవహక్కుల కమిటీ క్షేత్ర స్థాయి పరిశీలనలో జిల్లా కేంద్రంలోని ఎన్‌హెచ్ 163పై యూటర్న్ ఉన్నచోట తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. దీనికి ప్రధాన కారణం నేషనల్ హైవే డివైడర్ మధ్యలో పెద్ద చెట్లు ఉండటం, ఫొటో ఫ్లెక్సీలు యూటర్న్‌కు అడ్డుగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్పీకి వినతి పత్రాన్ని అందజేసినట్లు వివరించారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఆయన సత్వరమే చర్యలు తీసుకుంటామని తెలిపారని వివరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు ఫాల్తీయా రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి శనిగరపు ప్రవీణ్, పోరిక రాహుల్‌నాయక్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజాపాలన’ను సక్సెస్ చేయాలి

స్పెషల్ ఆఫీసర్ హరిప్రసాద్

శాయంపేట : గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు బాధ్యతయుతంగా పనిచేసి మండలంలో ఈనెల 28వ తేదీన చేపట్టనున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ హరిప్రసాద్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించగా తహసీల్దార్ సుభాషిణితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పెద్దకోడెపాక సర్పంచ్ అబ్బు ప్రకాష్‌రెడ్డి పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు అధికారులు సమాచారం ఇవ్వలేదని అన్నారు. సమాచారం లేకపోవడంతోనే కొద్ది మంది హాజరయ్యారని, పంచాయతీ కార్యదర్శులకు తప్ప ప్రజాప్రతినిధులకు సమాచారం లేదన్నారు. దీనిపై ప్రత్యేకాధికారి మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల సమయంలో కూడా పంచాయతీ కార్యదర్శులు రాత్రి వేళల్లో పోలింగ్ బూత్‌ల వద్ద ఉండకుండా ఇళ్లలోనే ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంపై నెగటివ్ ఇంప్రెషన్ ఉందని, పాజిటివ్‌లోకి తీసుకురావాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరుగకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని అన్నారు. కాగా ఆరెపల్లి, వసంతాపూర్ గ్రామాల సర్పంచ్‌లకు బదులు వారి భర్తలు, నర్సింహులపల్లి గ్రామ సర్పంచ్‌కి బదులుగా ఆతని కుమారుడు హాజరయ్యారు. మండల అధికారులు గైర్హజరు అవడంతో సమావేశం తూతూ మంత్రంగా కొనసాగింది.



ఆత్మకూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



శాయంపేట: సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ హరిప్రసాద్

అర్హులు దరఖాస్తు చేసుకునేలా చూడాలి

ఆత్మకూరు: ఈనెల 28 నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న ప్రజాపాలన కార్యక్రమంలో అర్హులైన నిరుపేదలు దరఖాస్తు చేసుకుని లబ్ధిపొందేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మండల కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి సమీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, గత బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఎదురు చూపులే మిగిలాయని, అర్హులైన నిరుపేదలను కూడా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలని వివక్ష చూపి ప్రభుత్వ పథకాల జాబితాలో ఎంపిక చేయలేదన్నారు. రాబోయే సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడాలన్నారు. కష్టపడే ప్రతి కార్యకర్తను తాను కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



ఎంపేడులో ఆర్థిక సాయం అందజేస్తున్న రవి

టేకుమట్ల: మండలంలోని ఎంపేడు, పెద్దంపల్లి గ్రామాలకు చెందిన మ్యాడగాని శ్రావన్, బొల్లికొండ ఆకాశ్‌లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మంగళవారం వారి కుటుంబ సభ్యులను మాజీ ఎస్సారెస్పీ చైర్మన్ ఆకుల రవి పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోటగిరి సతీష్‌గౌడ్, దాసారపు సదానందం, మండల నాయకులు ఉన్నారు.